డీఎల్.. ఫెయిల్

- జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్
- ట్రాక్ తప్పుతున్న వాహనదారులు
- 60శాతం మంది పాస్.. 40 శాతం మంది ఫెయిల్
- అవగాహన లేమియే కారణమంటున్న అధికారులు



చిత్తూరు రూరల్ (కాణిపాకం): డీఎల్ (డ్రైవింగ్ లైసెన్స్) టెస్ట్‌లో ఫెయిల్ అవుతున్న వాహనదారులు డీలా పడిపోతున్నారు. ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్ తప్పుతున్నారు. 60 శాతం మంది మాత్రమే ట్రాక్‌ను చాకచక్యంగా ఛేదిస్తున్నారు. 40 శాతం మంది రాణించలేకపోతున్నారు. వీరంతా అవగాహన లేమితో టెస్ట్‌లో విఫలమవుతున్నారు. దీంతో ఫెయిల్ అయిన వాహనదారులు మళ్లీ మళ్లీ ఫీజులు చెల్లించుకుంటూ ట్రాక్‌లో బండి నడపాల్సి వస్తోంది. దీనిపై సరైన అవగాహన లేకపోవడంతోనే ట్రాక్ టెస్ట్‌ను మిస్ అవుతున్నారని రవాణశాఖ అధికారులు సూచిస్తున్నారు.

చిత్తూరు నగరం ప్రశాంత్‌నగర్‌లో జిల్లా రవాణశాఖ కార్యాలయం ఉంది. ఇక్కడ ఐదేళ్ల కిత్రం డ్రైవింగ్ లైసెన్స్ జారీకి సంబంధించి ఆటోమెటిక్ డ్రైవింగ్ ట్రాక్‌ను తీసుకొచ్చారు. సుమారు రూ.కోటి వ్యయంతో ట్రాక్‌ను నిర్మించారు. ఇదీ సెన్సార్, సీసీ కెమెరాల పర్యవేక్షణలో నడుస్తోంది. డ్రైవింగ్‌లో మెలకువలు లేకుంటే ట్రాక్ నుంచి తప్పించుకోలేరు. డ్రైవింగ్, ట్రాక్, రోడ్డు భద్రత నియమావళి తెలుసుకుంటే ట్రాక్ పరీక్షను సులభతరంగా పూర్తి చేయవచ్చు. అయితే చాలా మంది పలు తప్పిదాలు చేస్తూ డీఎల్ పరీక్షల్లో బోల్తా పడుతున్నారు. పలుమార్లు ఫీజులు చెల్లించి ఫెయిల్ అవుతున్నారు. గత నాలుగు నెలల్లో 1430 మంది డీఎల్ పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 864 మంది పాస్ అయితే 566 మంది ఫెయిల్ అయ్యారు.

డీఎల్ పరీక్ష వివరాలు

నెల	హాజరు	పాస్	ఫెయిల్	ఉత్తీర్ణత శాతం
జనవరి	416	248	168	59.62
ఫిబ్రవరి	340	212	128	62.35
మార్చి	367	224	143	61.04
ఏప్రిల్	307	180	127	58.63

అవగాహన కోసం ఇలా...

చాలా మంది డ్రైవింగ్‌పై పట్టుందని నేరుగా డీఎల్ పరీక్షకు వచ్చేస్తున్నారు. అలాంటి వారు ఆటోమెటిక్ సిస్టంకు వెళితే పలు తప్పిదాలతో ఫెయిల్ అవుతున్నారు. ఇందు కోసమే డీఎల్ ట్రాక్ సిస్టంకు సమీపంలోనే డ్రైవింగ్ శిక్షణ ఎలా పూర్తి చేయాలో అవగాహన కల్పించేందుకు ఓ భవనాన్ని కేటాయించారు. ఆ భవనంలో ఏరకంగా శిక్షణ పూర్తి చేయాలో, వీడియో ద్వారా వాహనదారులకు చూపిస్తున్నారు. కొంత మంది ఆ వీడియోను ఒకటికి రెండు సార్లు చూసి ట్రాక్ జోలికి వెళుతున్నారు. మరి కొంత మంది అరకొరగా అవగాహన తెచ్చుకుని ఫెయిల్ అవుతున్నారు. ఇక అధికారులు కూడా దీనిపై పదే పదే వాహనదారులకు వివరిస్తున్నారు. డ్రైవింగ్ ఎలా చేయాలో మెలకువలు నేర్పిస్తున్నారు. ట్రాక్‌లో ఏదైనా సమస్యలు వస్తే డీఎల్ సెక్షన్‌లో ఉండే ఎంవీఐ కూడా తక్షణం స్పందిస్తుంటారు. వారు పలు సూచనలు చేస్తూ..వాహనదారులు ట్రాక్ పరీక్షను అధిగమించేందుకు చూస్తున్నారు.


వీడియో ద్వారా అవగాహన

డీఎల్‌లో తప్పిదాలు

- ద్విచక్ర వాహనాలు ట్రాక్ 8 ఆకారంలో ఒకటి కంటే ఎక్కువసార్లు కాళ్లు కిందమోపడం
- హెయిర్‌పిన్ బెండ్ ట్రాక్‌లో నేలమీద కాళ్లు పెట్టడం, సిగ్నల్ ఫెయిల్ అవ్వడం
- మడ్‌రోడ్డుపై ట్యాగ్ రీడింగ్ చేయకుండా వెళ్లిపోవడం..
- ఎల్ఎంవీ (లైట్ మోటర్ వెహికల్) 8 ట్రాక్‌లో కారు ముందు, వెనకకు నడపడం
- హెచ్ ట్రాక్‌లో రివర్స్‌లో ఇబ్బంది పడడం
- టీ ట్రాక్‌లో రివర్స్‌లో ఫెయిల్ అవ్వడం
- గ్రేడియంట్ వద్ద ఆపి ముందుకు వెళ్లాలి. కానీ బఫ్ఫర్ లైన్ దాటి వెనుకకు వచ్చేయడం
- హెచ్‌వీ (హెవీ వెహికల్)కు సంబంధించి హెచ్ ట్రాక్‌లో ముందు, వెనకకు నడిపినప్పుడు సరైన అవగాహన లేకపోవడం వల్ల ట్రాక్ తప్పడం

అవగాహన ఉంటే డీఎల్ ఈజీ



డీఎల్ ఆటోమెటిక్ సిస్టం ద్వారా 60 శాతం మంది గట్టెక్కుతున్నారు. టెస్ట్‌కు వచ్చేవారికి తొలుత వీడియో ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. తర్వాత ఫిజికల్‌గా ట్రాక్‌లోకే తీసుకెళుతున్నాం. ఎక్కడెక్కడ ఫెయిల్ అవుతుంటారో తెలియజేస్తున్నాం. గతంలో టూవీలర్‌లో ఒకసారి కాళ్లు కింద పెడితే ఫెయిల్ అవుతున్నారు. ఇప్పుడు రెండు సార్లు అవకాశం ఇచ్చారు.

-నిరంజన్‌రెడ్డి, డీటీసీ, చిత్తూరు

క్లుప్తంగా

మట్టి నమూనా పరీక్షలు


మట్టినమూనాలు సేకరిస్తున్న అధికారులు

యాదమరి: భూమిలో ఎటువంటి పోషక విలువలున్నాయో తెలుసుకోవడం కోసం మట్టి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి చరిత తెలిపారు. ఆమె బుధవారం తమ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మండలానికి 1,045 ఉచిత మట్టి నమూనా పరీక్షలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. మండల పరిధిలో 19 రైతు సేవా కేంద్రాలు ఉండగా ఒక్కో కేంద్ర పరిధిలో 55 చొప్పున ఉచితంగా భూసార పరీక్షలు చేయించేందుకు అవకాశం ఉందన్నారు. మిగతా రైతులు రూ.10 చెల్లించి భూసార పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. ఆసక్తి కలిగిన రైతులు మట్టి నమూనాలు తీసుకుని గ్రామంలోని రైతు సేవా కేంద్రాల్లో ఇస్తే ల్యాబ్‌కి పంపిస్తామని చెప్పారు.

పిల్లల సంరక్షణకు చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో పిల్లల రక్షణకు, అక్రమరవాణా నిరోధించేందుకు రియల్ స్వచ్ఛంద సంస్థ ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఆ సంస్థ అధ్యక్షులు రామారావు అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, బాల్యవివాహాలు, అక్రమ రవాణా నిరోధించేందుకు జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అనే సంస్థ కృషి చేస్తోందన్నారు. ఆ సంస్థ కు భాగస్వామిగా రియల్ ఆర్గనైజేషన్ జిల్లాలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో ఏళ్లగా పిల్లల సంరక్షణ కార్యక్రమాలు చేపడుతున్న జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ సంస్థ ఫౌండర్ భువన్ రిభు ఇటీవల మెడల్ ఆఫ్ హానర్ అందుకుని స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. ఆ హానర్ భువన్ రిభుకి వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని మరిన్ని స్వచ్ఛంద కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

సాగులో ఆధునిక సాంకేతికతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

పూతలపట్టు (కాణిపాకం): పూతలపట్టు మండలం బైటపల్లి గ్రామపంచాయతీలోని రైతు సేవ కేంద్రంలో బుధవారం స్కిల్ ఆఫ్ చిత్తూర్ డిజిటల్ ట్రెనింగ్ ప్రోగ్రామ్ ద్వారా పంటల సాగులో ఆధునిక టెక్నాలజీపై అవగాహన కల్పించారు. స్మార్ట్ ఫోన్ ద్వారా పంటల సాగులో రైతులకు ఉపయోగపడే యాప్‌లపై సమగ్రంగా వివరించారు. వ్యవసాయ చానల్స్ అయినా పాడిపంటలు, తెలుగు బడి, రైతు నేస్తం వంటి చానల్స్ ద్వారా నూతన వ్యవసాయ పద్ధతిలో తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. మరియు డిజిటల్ పేమెంట్స్ ద్వారా వ్యవసాయానికి సంబంధించిన ఎరువులు రసాయనిక పదార్థాలు కొనుగోలు చేయడం వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ జిల్లా వనరుల కేంద్రం అధికారి నాగ పద్మిని, గ్రామపంచాయతీ సర్పంచ్ రామ తులసి, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నారగల్లులో వైద్యశిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్

గుడిపాల: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ప్రజలకు ఇంటి వద్దే వైద్యం అందుతోందని 104 డాక్టర్ ప్రవీణ్ అన్నారు. నారగల్లు గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలు, కిషోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెర వ్యాధి గ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 60 రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సరళ, సుమతి, గీత, తమరై పాల్గొన్నారు.

యోగా అలవాటు చేసుకోవాలి


విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇస్తున్న గ్రంథాలయాధికారి సుజాత

ఐరాల: బాల్యం నుంచే ప్రతి ఒక్కరూ యోగా అలవాటు చేసుకోవాలని స్థానిక గ్రంథాలయాధికారి సుజాత అన్నారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులతో యోగా, ధ్యానం, ఆసనాలు వేయడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ చిన్నారులు ఆటపాటలతో విజ్ఞానం పెంపొందించుకునేలా ప్రభుత్వం వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

గుడిపాల ఎంపీడీవోగా శిరీష



గుడిపాల: స్థానిక ఎంపీడీవోగా శిరీషా బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇదే కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న కుమార్ ఎంపీడీవోగా ఉన్నారు. అనకాపల్లె జిల్లాలో గ్రామ పంచాయతీల విస్తరణాధికారిగా పనిచేస్తున్న శిరీషకు ఉద్యోగోన్నతి రావడంతో ఇక్కడికి ఎంపీడీవోగా వచ్చారు.

ఆసుపత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు క్షేమం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కేశవనారాయణ

తవణంపల్లె: గర్భిణులు ఆస్పత్రుల్లో ప్రసవించడం వల్ల తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి కేశవనారాయణ తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా బుధవారం దిగువ మాఘంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ రోగులకు ఆరోగ్య సూత్రాల గురించి వివరించారు. పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని వివరించారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యం చేయించుకోవాలని తద్వారా ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. అనంతరం గర్భవతులకు, వృద్ధులకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి


శిక్షణలో మాట్లాడుతున్న విజయశంకర్‌రెడ్డి

బంగారుపాళెం: రైతులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయశంకర్‌రెడ్డి సూచించారు. మండలంలోని రాగిమానుపెంట రైతు సేవా కేంద్రంలో బుధవారం రైతులకు వీహెచ్ఏ, రిసోర్సు పర్సన్ యాస్మిన్ ఆధ్వర్యంలో స్కిల్ ఆఫ్ చిత్తూరు డిజిటల్ ట్రెనింగ్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రైతులు స్మార్ట్‌ఫోన్లు ఎలా వినియోగించాలి, ఫోన్ల వల్ల కలిగే కలిగే లాభ నష్టాలను వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. స్మార్ట్‌ఫోన్ ద్వారా పంట సాగుకు తోడ్పాటునిచ్చే వివిధ రకాల యాప్‌ల గురించి తెలియజేశారు. రైతులు తమ స్మార్ట్ ఫోన్ ద్వారా నూతన పంటల సాగు విధానాలు, చీడ, పీడలు గుర్తించడం, సలహాలు, వాతావరణ పరిస్థితులు, ప్రభుత్వ పథకాల సమాచారం, మార్కెటింగ్ సమాచారం, సదుపాయాలను ఆధునిక సాంకేతికత ద్వారా తెలుసుకుని అధిక ఆదాయ మార్గాలను పెంపొందించుకోవాలని తెలియజేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో 40 మంది రైతులకు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో వీఏఏ స్వాతి, ఎంపీఈఓ రాణిప్రమీళ, రైతులు పాల్గొన్నారు.

పిల్లలను ఎండలో తిరగనీయొద్దు

ఐరాల: మూడేళ్ల లోపు చిన్నారులను ఉదయం 9 గంటలు దాటిన తరువాత ఎండలో తిరగనీయొద్దని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని గోవిందరెడ్డిపల్లిలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 65 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. చిన్నారులకు నీరు, ద్రవపదార్థాలు అధికంగా ఇవ్వాలని తెలిపారు. ఎండలో ఎక్కువగా తిరిగితే వడదెబ్బకు గురికావడంతో పాటు చర్మవ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. చేతుల శుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన దినోత్సవం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన దినోత్సవాన్ని విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. తేనె బండలోని స్వామివారి ఆలయంలో పల్లకి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. విశ్వ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు దయాచారి, మండల అధ్యక్షులు హేమచంద్ర ఆచారి, కృష్ణమాచారి, రామాచారి, ఉమాశంకర్ పాల్గొన్నారు.

గుడిపాల: మండలంలోని 197రామాపురంలో వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠంలో బుధవారం ఆరాధన పూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ,దీపారాధన, కాగడా హారతి, పాలాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. స్వామివారి సమాధి ఘట్టం నిర్వహించారు. ధర్మకర్త బ్రహ్మయ్య భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు.


పూజలో విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు

గంజాయి విక్రేత అరెస్టు

చిత్తూరు అర్బన్: నగర శివారులో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని తాలూక పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు ఒడిస్సాకు చెందిన బిశ్వనాథ్(33) అనే వ్యక్తి చిత్తూరు శివారులోని గోపాలపురం వద్ద ఓ గ్రానైట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇటీవల ఒడిస్సా నుంచి గంజాయి తీసుకొచ్చి చిత్తూరులో విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అతని తీరుపై నిఘా ఉంచారు. ఈ క్రమంలోనే బుధవారం ఫ్యాక్టరీ ఆవరణలో రెండు కిలోల గంజాయి విక్రయించడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేనట్లు తాలూక ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.

డిజిటల్ నైపుణ్యం అవసరం


యాప్‌లను డౌన్‌లోడ్ చేయిస్తున్న అధికారులు

గుడిపాల: ప్రతి రైతు ఆధునిక డిజిటల్ నైపుణ్యం కలిగి ఉండాలని వ్యవసాయాధికారి మాధవి అన్నారు. మండలంలోని ఎఎల్‌పురం సచివాలయం పరిధిలో బుధవారం రైతులకు స్కిల్ ఆఫ్ చిత్తూరు, డిజిటల్ శిక్షణ నిర్వహించారు. వారు రైతులకు ఆధునిక డిజిటల్ నైపుణ్యంపై అవగాహన కల్పించి, సాంకేతిక వ్యవసాయ పరిజ్ఞానం, వ్యవసాయ యాప్‌లు, డిజిటల్ పేమెంట్స్, యూట్యూబ్ చానల్స్ నిర్వహణ, వాతావరణం, మార్కెట్ ధరల గురించి రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు సంబంధించిన మొబైల్‌లో వ్యవసాయానికి సంబంధించిన యాప్‌లను డౌన్‌లోడింగ్ చేయించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది తులసీరాంరెడ్డి పాల్గొన్నారు.

బైపీసీ కోర్సు ప్రారంభం

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం జూనియర్ కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరంలో నూతనంగా బైపీసీ కోర్సును అనుమతిస్తూ ఇంటర్మీడియట్ విద్యాశాఖ అనుమతి ఇచ్చిందని బొమ్మసముద్రం కళాశాల ప్రిన్సిపల్ శరత్‌చంద్రశేఖర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎంపీసీ, సీఈసీతో పాటు బైపీసీ కోర్సులో కూడా ప్రవేశం పొందవచ్చన్నారు. ఇటీవల జరిగిన పరీక్షల్లో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని గుర్తుచేశారు. కళాశాల అడ్మిషన్ డ్రైవ్‌లో లెక్చరర్లు రెడ్డెప్ప, ఓబులేసు, జ్యోతిసెల్వి, హర్ష పాల్గొన్నట్లు తెలిపారు.

ఇచ్చిన హామీ నెరవేర్చాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఆశాలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఏటీయూసీ జిల్లా నాయ కులు నాగరాజులు డిమాండ్ చేశారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని డీఎంహెచ్ఓకు బుధవారం ఆశా వర్కర్ల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆశాలకు వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ గుర్తింపు కల్పిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. అయితే ఆ హామీలను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు, నాయకులున్నారు.

యువ డాక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే నివాళి

బంగారుపాళెం: మండలంలోని బండ్లదొడ్డి గ్రామంలో యువ డాక్టర్ వెంకటేష్ మృతికి బుధవారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్, నాయకులు నివాళులర్పించారు. కొదమడుగు వైఎస్సార్‌సీపీ సర్పంచ్, మండల ఎస్టీ విభాగం అధ్యక్షురాలు మాలతీ ప్రతాప్ కుమారుడు డాక్టర్ వెంకటేష్ (ఎంబీబీఎస్, ఎంఎస్) ఆకస్మిక మృతి చెందారు. విషయం తెలుసుకున్న సునీల్‌కుమార్, స్థానిక నాయకులతో కలసి మృతుని స్వగ్రామం బండ్లదొడ్డికి చేరుకున్నారు. ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. మండలంలోని టేకుమంద గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు, మాజీ డీలర్ రామ్మూర్తి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భౌతిక కాయానికి నాయకులు నివాళులర్పించారు. మండల పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, ఎంపీపీ అమరావతి, మాజీ సమితి అధ్యక్షులు తులసీరామకృష్ణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ హిమకర్‌రాజా, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అమరనాథ్, మండల బీసీ, ఎస్సీసెల్ అధ్యక్షులు మొగిలీశ్వర్, నాగరాజ, రైతు విభాగం నాయకులు పాలాక్షిరెడ్డి, అరుణామల్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షులు గజేంద్ర, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.


వెంకటేష్ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న సునీల్‌కుమార్, నాయకులు

ఒళ్లు గగుర్పొడిచే ఓంశక్తి భక్తుల విన్యాసాలు


వేలాడుతున్న ఓంశక్తి భక్తులు


అమ్మవారికి జలధి పూజలు చేస్తున్న భక్తులు

యాదమరి: మండల కేంద్రంలో నిర్వహించిన గంగ జాతర ప్రశాంతంగా ముగిసింది. రెండు రోజుల పాటు అమ్మవారి దర్శనానికి వచ్చిన అశేష భక్త జన వాహినికి నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బుధవారం జరిగిన అమ్మవారి నిమజ్జన కార్యక్రమంలో ఓంశక్తి భక్తుల విన్యాసాలు చూపరుల ఒళ్లు గగుర్పొడిచేలా ఉన్నాయి. జాతరలో కేరళ వాయిద్యాలు, బాణాసంచా వేడుకలు ఆకట్టుకున్నాయి. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పర్యవేక్షించారు.

వైభవంగా ద్రౌపదీ కల్యాణం

గుడిపాల : మండలంలోని వసంతాపురంలో 18 రోజుల పాటు నిర్వహించే మహాభారత యజ్ఞంలో భాగంగా బుధవారం ద్రౌపదీ కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ద్రౌపదీ ధర్మరాజుల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసి కల్యాణోత్సవం నిర్వహించారు. సంప్రదాయ బద్ధంగా పురోహితులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. భాగవతార్ వినయ్‌ప్రసాద్ రెడ్డి అమ్మవారి కల్యాణోత్సవానికి సంబంధించిన హరికథను భక్తులకు వినిపించింది. మహిళలు అమ్మవారికి కల్యాణానికి అధిక సంఖ్యలో హాజరయ్యారు.


అమ్మవారికి కల్యాణం చేస్తున్న అర్చకులు


హాజరైన మహిళలు

నగరంలో జాతర సందడి

- చురుగ్గా జాతర ఏర్పాట్లు
- నిఘా పెట్టిన పోలీసులు
- ఈ నెల 13,14 తేదీల్లో జాతర

చిత్తూరు రూరల్ (కాణిపాకం): అప్పుడే నగరంలో జాతర సందడి మొదలైంది. ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. జాతర పందిరి వేసినప్పటి నుంచి జలధి పూర్తి చేసేందుకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్న నేపథ్యంలో పోలీసులు నిఘా పెట్టారు. ఈ నెల 13, 14 తేదీల్లో గంగ జాతర వైభవంగా నిర్వహించనున్నారు. చిత్తూరు నగరంలో ఏటా జరిగే గంగజాతర ఈసారి కూడా అట్టహాసంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నారు. నగరంలోని నడివీధి, గిరింపేట, సంతపేట, కొంగారెడ్డిపల్లి, దొడ్డిపల్లి, మంగసముద్రం తదితర ప్రాంతాల్లో ఈనెల 13, 14 తేదీల్లో గంగజాతర నిర్వహణకు ముహూర్తం ఖరారు చేశారు. వారం రోజులుగా ఆయా ప్రాంతాల్లో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మండపంతో పాటు దారిపొడవునా చలువ పందిరి ఏర్పాటు చేశారు. మండపాలను ముస్తాబు చేస్తున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా క్యూలు ఏర్పాటు చేస్తున్నారు. భారీ స్థాయిలో విద్యుత్ దీపాలతో కటౌట్‌లు సిద్ధం చేస్తున్నారు.


చిత్తూరు నడివీధిలో కొనసాగుతున్న ఏర్పాట్లు


గిరింపేటలో ఏర్పాటు చేస్తున్న మండపం

జాతరకు నిఘా నీడ

గంగమ్మ కొలువుదీరే ప్రాంతాలపై పోలీసులు నిఘా పెట్టారు. ఆ జాతర నిర్వాహకులతో ప్రత్యేకంగా మాట్లాడారు. పలు సూచనలు చేశారు. జాతర ముగిసే వరకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. నిబంధనలు పాటించాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు.

ప్రత్యేకత చాటేలా..

అమ్మోరు జాతర ప్రత్యేకతను చాటేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మండపాల్లో సౌండ్ సిస్టం, విద్యుత్ దీపాలు, పుష్పాలంకరణ, డప్పు వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వీధినాటకాలు, అన్నదాన కార్యక్రమాలకు ప్రణాళిక రూపొందించారు. దీంతో పాటు మండపం ప్రత్యేక ఆకర్షణ కోసం ఎలక్ట్రానిక్ పరికరంతో కూడిన అమ్మవారి ప్రతిమలను తీసుకురానున్నారు.

ముగిసిన గంగజాతర


ఊరేగుతున్న దుర్గాలమ్మ

గుడిపాల: బొమ్మసముద్రం గ్రామంలోని దుర్గాలమ్మ గంగజాతర బుధవారంతో ఘనంగా ముగిసింది. రాత్రి అమ్మవారిని మంగళ వాయిద్యాల మధ్య ఊరేగించారు. ఉదయం మహిళలందరూ పొంగళ్లు పెట్టి వారి మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం గుడివద్ద కొబ్బరికాయలు కొట్టి దుర్గాలమ్మ అమ్మవారిని ఉయ్యాలలో ఊరేగించారు.